సాక్షి
అల్లూరి సీతారామరాజు జిల్లా

ఆదివారం । 5 । నవంబర్ । 2023



ఉష్ణోగ్రతలు ఇలా..
సాక్షి,పాడేరు: మినుములూరులో 18డిగ్రీలు, అరకులోయలో 18.8, చింతపల్లిలో 19 డిగ్రీల ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి.



అటవీ సంరక్షణకు చెక్‌పోస్టు
పటిష్టమైన అటవీ సంరక్షణ కోసం సిబ్బంది ఎప్పుడు అప్రమత్తంగా ఉండాలని డీఎఫ్‌వో నరేంద్రియన్ అన్నారు.
8లో



విశేషంగా నిత్య కల్యాణం
సింహాచలం శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామికి శనివారం నిత్యకల్యాణం మాంగల్యధారణ, తలంబ్రాలు ఘట్టాలతో నిర్వహించారు.

న్యూస్‌రీల్

కాఫీ పండ్ల కొనుగోలుకు చర్యలు



జీసీసీ సిబ్బందితో సమావేశమైన బ్రాంచ్ మేనేజర్ మురళీకృష్ణ

అనంతగిరి: జీసీసీ ద్వారా కాఫీ పండ్ల కొనుగోలు చేపట్టామని జీసీసీ కాశీపట్నం బ్రాంచ్ మేనేజర్ మురళీకృష్ణ తెలిపారు. శనివారం మండలంలోని కాశీపట్నం జీసీసీ కార్యాలయంలోని సేల్స్‌మన్లతో సమావేశమయ్యారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బరజోల, మర్రిగుడ, లక్ష్మీపురం, పినకోట, పైనంపాడు, వేంగడ పంచాయతీల్లో గిరిజనులు పండిస్తున్న కాఫీని కొనుగోలు ఏర్పాట్లు చేస్తున్నామన్నారు. అలాగే గిరిజనులు రైతులు దళారులను నమ్మిమోసపోవద్దని, జీసీసీ కాఫీని విక్రయించడం ద్వారా తూకాల్లో మోసం లేకుండా చెల్లింపులు చేస్తామన్నారు. పార్చిమెంట్ కాఫీ కిలో రూ.280, చెర్రీ కాఫీ కిలో ధర 145, రొబస్టా కాఫీ కిలో ధర 70తో కొనుగోలు చేస్తున్నామన్నారు.

గౌరీ పరమేశ్వరుల ఉత్సవాలకు పందిరి రాట



ఉత్సవాలకు పందిరి రాట వేస్తున్న పాడేరు ఎమ్మెల్యే కొట్టగుళ్లి భాగ్యలక్ష్మి

సాక్షి,పాడేరు: ఈనెల 11 నుంచి పాడేరులో నెలరోజులపాటు నిర్వహించనున్న గౌరీ పరమేశ్వరుల ఉత్సవాలకు సంబంధించి శనివారం పందిరి రాట కార్యక్రమం నిర్వహించారు. పాడేరు ఎమ్మెల్యే కొట్టగుల్లి భాగ్యలక్ష్మి తొలిపూజ నిర్వహించిన అనంతరం ఈ కార్యక్రమం జరిగింది. మాజీ సర్పంచ్ వంతాల చిన్నయ్యదొర, ఉత్సవ కమిటీ అధ్యక్షుడు మళ్ల పరమేశ్వరరావు, ఇతర ప్రతినిధులు కొణతాల సతీష్, మద్దల చిన్నారి, సూరిబాబు, ప్రశాంత్, దాడి శివ, తదితరులు పాల్గొన్నారు.

నేషనల్ గేమ్స్‌లో గిరి యువకుడి ప్రతిభ

- విలువిద్యలో బంగారు పతకం సాధించిన భైరాగినాయుడు



పాడేరు రూరల్ : గోవాలో జరుగుతున్న 37వ నేషనల్ గేమ్స్ ఆఫ్ ఇండియా పోటీల్లో పాడేరుకు చెందిన గిరిజన యువకుడు గెమ్మెలి భైరాగినాయుడు మరోసారి సత్తాచాటాడు. బంగారు పతాకాన్ని సాధించి అల్లూరి జిల్లాకు గుర్తింపు తెచ్చాడు. పాడేరు మండలం సుంద్రుపుట్టు గ్రామానికి చెందిన గెమ్మెలి భైరాగి నాయుడు విలువిద్య క్రీడాకారుడు. గోవాలో జరుగుతున్న 37వ నేషనల్ గేమ్స్ ఆఫ్ ఇండియా పోటీల్లో రాష్ట్రం తరఫున ఆడుతున్నాడు. శనివారం జరిగిన ఫైనల్ పోటీల్లో సత్తా చాటి బంగారు పతకం కైవసం చేసుకున్నాడు. కేరళలో 2015లో జరిగిన 35వ జాతీయ క్రీడల్లో బంగారు పతకం సాధించాడు. అతనికి అర్చరీ అకాడమి కోచ్ అడపా సుధాకర్ నాయుడు, అర్చరీ క్రీడాకారిణి శోభ సంతోష్ అభినందనలు తెలిపారు.



కిలో రూ.20 ధర పలికిన క్యారెట్



కిలో రూ.200 ధర పలికిన బస్తరు పిక్కలు



కిలో రూ.15 ధర పలుకుతున్న చిలకడ దుంపలు

ఆదాయం అదిరె..!

గిరి రైతులు సేంద్రియ విధానంలో పండించడం వల్ల మంచి ఆదాయం పొందుతున్నారు. కూరగాయలు, చిక్కుడు జాతి ఉత్పత్తులకు వారపు సంతల్లో మంచి ధర లభిస్తోంది. ఇక్కడ ఉత్పత్తులను కొనుగోలు చేసేందుకు దూర ప్రాంతాల నుంచి వస్తున్న వ్యాపారులు పోటీపడి కొనుగోలు చేస్తున్నారు.

- ఆశాజనకంగా కూరగాయలు, చిక్కుడు జాతి పంటలు
- మంచి దిగుబడులతో గిరి రైతుల్లో ఆనందం
- మార్కెట్లో లాభదాయకంగా ధరలు
- సేంద్రియ విధానంలో పండించడంతో మంచి గిరాకీ



పాడేరు పాత బస్టాండ్‌లోని కూరగాయల మార్కెట్

సాక్షి, పాడేరు: ఖరీఫ్ సీజన్ గిరి రైతులకు కలిసొచ్చింది. కూరగాయలు, ఆకు కూరలు, చిక్కుడు జాతి పిక్కల దిగుబడులు ప్రారంభం కావడంతో వారపు సంతల్లో భారీగా వ్యాపారం జరుగుతోంది. వీటిని పాడేరు డివిజన్‌లో 5,496 ఎకరాల విస్తీర్ణంలో గిరి రైతులు పండిస్తున్నారు. విస్తారంగా వర్షాలు కురవడం, వాతావరణ పరిస్థితులు అనుకూలంగా ఉన్నందున దిగుబడులు ఆశాజనకంగా ఉన్నాయి.

భారీగా వ్యాపారం

జిల్లాలో చింతపల్లి, గూడెంకొత్తవీధి, జి.మాడుగుల, పాడేరు, హుకుంపేట, అరకులోయ, డుంబ్రిగుడ, అరకులోయ, అనంతగిరి, ముంచంగిపుట్టు, పెదబయలు ప్రాంతాల్లో కూరగాయ పంటలను అధిక విస్తీర్ణంలో సాగు చేస్తున్నారు. అరకు, సుంకరమెట్ట, హుకుంపేట, ముంచంగిపుట్టు, పాడేరు, అన్నవరం, జి.మాడుగుల, చింతపల్లి, ధారకొండ, సీలేరు, పాడేరు సంతల్లో కూరగాయలు, దుంపజాతులు, చిక్కుళ్ల వ్యాపారం భారీగా జరుగుతోంది.

ధరలిలా..

పాడేరు మార్కెట్లో బస్తరు పిక్కలు కిలో రూ.200, నాగలిదుంపలు కిలో రూ.18, నాటు టమాటా కిలో రూ.30, చిలకడదుంప కిలో రూ.20, చిక్కుళ్లు, బీన్స్ కిలో రూ.30, క్యారట్ కిలో రూ.20 చొప్పున కొనుగోళ్లు జరుగుతున్నాయి.

సేంద్రియ సాగు వల్ల గిరాకీ

ఏజెన్సీలో గిరిజన రైతులు రసాయన ఎరువులు, పురుగు మందులు వినియోగించకుండా సేంద్రియ విధానంలో పండిస్తున్నారు. ఆరోగ్యకరమైన ఉత్పత్తులు కావడంతో మార్కెట్లో మంచి డిమాండ్ ఉంది. ఇక్కడి ఉత్పత్తులను కొనుగోలు చేసేందుకు ఉమ్మడి విజయనగరం, విశాఖ, తూర్పుగోదావరి జిల్లాలతో పాటు విజయవాడ నుంచి వ్యాపారులు వస్తున్నారు.

మంచి ధర పొందుతున్నాం



పాడేరు మార్కెట్‌లో కొనుగోలు ధరలు ఆశాజనకంగా ఉన్నాయి. చిలకడ దుంపలు, పెద్ద చిక్కుళ్లకు మంచి ధర పలుకుతోంది. చిలకడ దుంపలు 40 కిలోల బస్తా రూ.700కు కొనుగోలు చేశారు. 20 బస్తాలు విక్రయించగా రూ.14 వేల ఆదాయం వచ్చింది.

– కొర్రా కామేశ్వరరావు, గిరి రైతు, రింతాడ

ఆశాజనకంగా దిగుబడులు



పాడేరు డివిజన్‌లో కూరగాయల సాగు ఆశాజనకంగా ఉంది. వర్షాలు పంటలకు మేలు చేశాయి. ఈక్రాప్ నమోదు సమయంలో ఉద్యానవన సిబ్బంది క్షేత్రస్థాయిలో పరిశీలించారు. అన్నిచోట్ల పంటలు ఆరోగ్యంగా ఉన్నాయి. మార్కెట్లో ధరలు బాగున్నందున మంచి ఆదాయం పొందుతున్నారు.

– రమేష్‌కుమార్‌రావు, జిల్లా ఉద్యానవనశాఖాధికారి, పాడేరు

విద్యార్థుల ఆరోగ్యంపై దృష్టి పెట్టండి



నల్గొండ ఆశ్రమ పాఠశాలలో విద్యార్థినులతో మాట్లాడుతున్న పీవో సూరజ్ గనోరే



ఉపాధ్యాయులతో మాట్లాడుతున్న పీవో సూరజ్ గనోరే

రంపచోడవరం ఐటీడీఏ పీవో సూరజ్ గనోరే

రంపచోడవరం: గిరిజన సంక్షేమ ఆశ్రమ పాఠశాల చదువుతున్న విద్యార్థుల చదువుతోపాటు ఆరోగ్యంపై ప్రత్యేక దృష్టి సారించాలని రంపచోడవరం ఐటీడీఏ పీవో సూరజ్ గనోరే అధికారులను ఆదేశించారు. మండలంలోని నల్లగొండ ఆశ్రమ పాఠశాలను పీవో శనివారం ఆకస్మికంగా సందర్శించారు. ఈ సందర్భంగా పీవో మాట్లాడుతూ పాఠ్య ప్రణాళిక ప్రకారం సిలబస్ పూర్తి చేయాలని ఉపాధ్యాయులకు సూచించారు. విద్యార్థులకు జ్వరం వస్తే వెంటనే దగ్గరలోని పీహెచ్‌సీకి తీసుకువెళ్లి వైద్యం అందించాలన్నారు. నిబంధనల ప్రకారం మెనూ కచ్చితంగా అమలు చేయాలని ఆదేశించారు. హాస్టల్ రికార్డులు పక్కాగా నిర్వహించాలన్నారు. విద్యార్థులకు అర్థమయ్యే రీతిలో బోధించాలని ఉపాధ్యాయులకు సూచించారు. విద్యార్థుల సామర్థ్యాన్ని పరీక్షించారు. గుడ్లు, చికెన్, నిత్యావసర వస్తువులు సకాలంలో వస్తున్నాయా లేదా అన్ని ప్రశ్నించారు. డీడీ జాన్‌రాజ్, ఏటీడబ్ల్యూవో రామతులసి పాల్గొన్నారు.

అలసత్వం వహిస్తే చర్యలు

ప్రభుత్వ పాఠశాలలు, ఆశ్రమ పాఠశాలల్లో విద్యార్థులకు సకాలంలో సిలబస్ పూర్తి చేయాలని ఐటీడీఏ పీవో సూరజ్ గనోరే అన్నారు. శనివారం ఆయన మండలంలోని పలు పాఠశాలలను సందర్శించారు. ఈ సంరద్భంగా పీవో మాట్లాడుతూ పలు పాఠశాలలో కొంత మంది ఉపాధ్యాయులు సిలబస్ పూర్తి చేయకపోవడంతో ఆయన ఆగ్రహానికి గురయ్యారు. సకాలంలో సిలబస్ పూర్తి చేయకుండా నిర్లక్ష్యంగా వ్యవహరించిన వారికి నోటీసులు జారీ చేస్తామని ఆయన హెచ్చరించారు. మెనూకు సంబంధించి స్టాక్ నిర్వహణ చేపట్టకపోవడం, నాడు-నేడు పనుల్లో అలసత్వం వహించిన వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని పీవో హెచ్చిరంచారు.

ఆశా కార్యకర్తల నియామకానికి దరఖాస్తుల ఆహ్వానం

పాడేరు రూరల్ : జిల్లాలోని గ్రామ సచివాలయాల్లో ఖాళీగా ఉన్న ఆశా కార్యకర్తల భర్తీకి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు జిల్లా వైద్యారోగ్యశాఖ అధికారి(డీఎంహెచ్‌వో) డాక్టర్ జమల్‌బాషా ఒక ప్రకటనలో తెలిపారు. అభ్యర్థులకు ఉండాల్సిన అర్హతల వివరాలు హెచ్‌టీటీపీఎస్://అల్లూరిసీతారామరాజు.ఏపీ.జీవోవి.ఇన్ వెబ్‌సైట్‌లో పొందు పరిచామన్నారు. అర్హత, ఆసక్తి గల అభ్యర్థులు ఈనెల 10వ తేదీలోగా సమీప గ్రామ పరిధిలో ఉన్న ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల మెడికల్ ఆఫీసర్లకు నేరుగా అందజేయాలని సూచించారు. దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులు ఉద్యోగాల కోసం ఎటువంటి ప్రలోభాలకు గురికావద్దన్నారు. దళారులను నమ్మి మోసపోవద్దని ఆయన సూచించారు. ఆశా కార్యకర్తల నియామకం పారదర్శకంగా చేపడుతున్నారు. ఈ విషయంలో ఎవరినీ ఆశ్రయించి మోసపోవద్దన్నారు.

వీసీటీలో మౌలిక సదుపాయాలు పెంచాలి

- అధికారులకు పోర్టు చైర్మన్ అంగముత్తు ఆదేశం

సాక్షి, విశాఖపట్నం : అంతర్జాతీయ పర్యాటకులకు అనుగుణంగా విశాఖపట్నం ఇంటర్నేషనల్ క్రూయిజ్ టెర్మినల్(వీవీసీటీ)లో మౌలిక సదుపాయాలు పెంచాలని అధికారులను పోర్టు చైర్మన్ డా.అంగముత్తు ఆదేశించారు. పోర్టులో ఇటీవలే ప్రారంభించిన క్రూయిజ్ టెర్మినల్ భవనాన్ని ఆయన శనివారం పరిశీలించారు. ఈ సందర్భంగా టెర్మినల్ భవనంలో ఏర్పాటు చేయాల్సిన మౌలిక సౌకర్యాలు, టూరిస్టులకు అవసరమైన వ్యవస్థలకు సంబంధించిన రోడ్ మ్యాప్‌ను వీలైనంత త్వరగా సిద్ధం చేయాలని ఆదేశించారు. తూర్పు తీరంలో ఉన్న ఏకైక క్రూయిజ్ టెర్మినల్ కావడం వల్ల.. దీనిని ప్రపంచ పర్యాటకుల్ని ఆకట్టుకునేలా తీర్చిదిద్దాలన్నారు. టెర్మినల్‌ని మరింత అభివృద్ధి చేసేందుకు అవసరమైన చర్యల్ని వెంటనే చేపట్టాలని స్పష్టం చేశారు. ఆయన వెంట సెక్రటరీ వేణుగోపాల్, ట్రాఫిక్ మేనేజర్ రత్నశేఖర్ తదితరులున్నారు.

ప్రజాసేవలపై ప్రత్యేక శ్రద్ధ

- నిర్లక్ష్యం చేస్తే చర్యలు
- పాడేరు ఎమ్మెల్యే కొట్టగుల్లి భాగ్యలక్ష్మి
- గడుతూరులో గ్రామ సచివాలయ భవనం ప్రారంభం



పెదలోచలి గ్రామంలో సీసీ రోడ్డు నిర్మాణ పనులను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే భాగ్యలక్ష్మి

జి.మాడుగుల: ప్రజలకు సేవలు అందించడంలో ప్రత్యేకశ్రద్ధ కనబరచాలని పాడేరు ఎమ్మెల్యే కొట్టగుళ్లి భాగ్యలక్ష్మి సూచించారు. శనివారం మండలంలోని గడుతూరులో గ్రామ సచివాలయ నూతన భవనాన్ని ఆమె ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రజలకు సేవలు అందించడంలో నిర్లక్ష్యం వహిస్తే అధికారులపై క్రమశిక్షణ చర్యలు తప్పవని హెచ్చరించారు. ప్రజలకు సేవలు మరింత చేరువయ్యే విధంగా ప్రభుత్వం కృషి చేస్తోందన్నారు. దీనిలో భాగంగానే సచివాలయ వ్యవస్థను ఏర్పాటు చేసిందని ఆమె తెలిపారు. సీఎం జగన్‌మోహన్‌రెడ్డి ఆశయసాధనకు ప్రతిఒక్కరూ కృషి చేయాలని కోరారు. ప్రతిరోజు గ్రామసచివాలయంలో మధ్యాహ్నం మూడు గంటలనుంచి ఐదు గంటల వరకు స్పందన నిర్వహించాలని ఆదేశించారు. గడప గడపకు మన ప్రభుత్వంలో గుర్తించిన ప్రతి సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకుంటున్నామని చెప్పారు. దీనిలో భాగంగా మంజూరైన పనులను త్వరలో ప్రారంభిస్తామని చెప్పారు. మండలంలో 17 పంచాయతీలు, తొమ్మిది గ్రామసచివాలయ భవనాలను ప్రారంభించినట్లు చెప్పారు. పెదలోచలిలో నిర్మించిన 250 మీటర్ల సీసీ రోడ్డు నిర్మాణ పనులను ఆమె ప్రారంభించారు. గడప గడపకు మన ప్రభుత్వంలో స్థానికుల వినతి మేరకు ఈ రోడ్డు నిర్మాణం చేపట్టామన్నారు. ఎంపీపీ కొర్మా పద్మ, ఎంపీడీవో లోహిత్ జయసాగర్, తహసీల్దార్ కె.అప్పలస్వామి, సీఐ సత్యనారాయణ, సర్పంచ్‌ల ఫోరం అధ్యక్షుడు రామకృష్ణ, సర్పంచ్‌లు మాతే అప్పలమ్మ, కిముడు రాంబాబు, చినకుమారి, ఎంపీటీసీలు గబ్బాడి సన్యాసిదొర, కూడా చిన్నారావు, వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు ఎస్ మత్స్యకొండనాయడు, మైనారిటీ సెల్ జిల్లా కన్వీనర్ నాగూర్‌బాబు తదితరులు పాల్గొన్నారు.

గిరి యువతకు సివిల్స్ ఉచిత శిక్షణ

రంపచోడవరం ఐటీడీఏ పీవో సూరజ్ గనోరే



రంపచోడవరం: ఏజెన్సీలో డిగ్రీ ఉత్తీర్ణులైన గిరిజన యువత సివిల్ సర్వీసెస్, గ్రూప్స్‌లో ఉచిత శిక్షణ ఇవ్వనున్నట్లు ఐటీడీఏ పీవో సూరజ్ గనోరే తెలిపారు. ఈ మేరకు శనివారం ఒక ప్రకటన విడుదల చేశారు. ఏజెన్సీలో డిగ్రీ ఉత్తీర్ణులైన గిరిజన యువతకు తొమ్మిది నెలలు పాటు సివిల్ సర్వీసెస్‌తో, గ్రూప్-1,2లకు ఐటీడీఏ ద్వారా శిక్షణ ఇవ్వడం జరుగుతుందన్నారు. రంపచోడవరం వైటీసీలో హాస్టల్ వసతితో శిక్షణ ఉంటుందన్నారు. ఆసక్తి గల అభ్యర్థులు ఈనెల 13 నుంచి 18 తేదీ వరకు ఐటీడీఏ కార్యాలయంలో దరఖాస్తులు చేసుకోవాలన్నారు. దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులకు ఈ నెల 26న పరీక్ష నిర్వహిస్తామన్నారు. రెండో టెస్టు డిసెంబరు 3న నిర్వహిస్తామన్నారు. డిసెంబర్ 8, 9 తేదీల్లో రెండు టెస్టులలో ఉత్తీర్ణులైన అభ్యర్థులకు ఇంటర్వ్యూలు నిర్వహించి తుది జాబితా డిసెంబర్ 10న ప్రకటిస్తామని చెప్పారు. డిసెంబర్ 15 నుంచి సెప్టెంబర్ 15, 2024 వరకు శిక్షణ ఉంటుందన్నారు. గిరిజన యువతను సివిల్స్, గ్రూప్స్‌లో రాణించే విధంగా ఐటీడీఏ ప్రోత్సాహిస్తుందన్నారు. ఆసక్తి గల అభ్యర్థులు కులధ్రువీకరణ పత్రాలతో ఐటీడీఏలో దరఖాస్తు చేసుకోవాలని ఆయన సూచించారు.

శబరిమలకు ఆర్టీసీ బస్సులు

డాబాగార్డెన్స్ : శబరిమలకు వెళ్లే అయ్యప్పస్వామి భక్తులకు ఏపీఎస్‌ఆర్టీసీ బస్సులు నడుపుతుందని ప్రజా రవాణా అధికారి అప్పలరాజు పేర్కొన్నారు. 5, 6, 7 రోజుల ప్రత్యేక ప్యాకేజీలతో బస్సులు అందుబాటులో ఉంచినట్టు తెలిపారు. ఒడిశాలోని నవరంగపూర్, కోరాపుట్, జైపూర్ తదితర ప్రాంతాలకు కూడా ఆర్టీసీ విశాఖ రీజియన్ పంపుతుందని చెప్పారు. ఈ ఏడాది స్వాముల కోసం అమరావతి, ఇంద్ర, సూపర్ లగ్జరీ, అల్ట్రా డీలక్స్ బస్సులు అందుబాటులో ఉంచినట్లు తెలిపారు.

వెబ్‌సైట్‌లో స్టాఫ్ నర్సు ఉద్యోగాల మెరిట్ లిస్టు

మహారాణిపేట : స్టాఫ్ నర్సు ఉద్యోగాలకు సంబంధించి ఫైనల్ మెరిట్ లిస్టును వెబ్‌సైట్‌లో పెట్టారు. గతంలో ప్రొవిజినల్ మెరిట్ లిస్టు పెట్టారు. దీనిపై అభ్యంతరాలు స్వీకరించారు. దాదాపు 200 పైగా అభ్యంతరాలు వచ్చాయి. వీటిని పరిశీలించి ఫైనల్ మెరిట్ లిస్టు పెట్టినట్టు వైద్య ఆరోగ్యశాఖ రీజనల్ డైరెక్టర్ డాక్టర్ బి.సుజాత తెలిపారు. http@//cfw.ap.nic.inలో ఫైనల్ మెరిట్ లిస్టు ఉంచినట్లు పేర్కొన్నారు. త్వరలో సర్టిఫికెట్ల వెరిఫికేషన్, ఇతర ప్రక్రియ జరుగుతుందన్నారు. రూల్ ఆఫ్ రిజర్వేషన్ ప్రకారం పోస్టులు భర్తీ చేస్తామని తెలిపారు.

నేడు మంత్రి రజిని విశాఖ రాక

మహారాణిపేట: రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖ మంత్రి విడదల రజని ఆదివారం విశాఖ వస్తున్నారు. హైదరాబాద్ నుంచి విమానంలో ఉదయం 11.50 గంటలకు విశాఖ విమానాశ్రయానికి చేరుకుంటారు. అక్కడ నుంచి నేరుగా వెళ్లి మహారాణిపేటలోని బ్రాహ్మకుమారీస్ కార్యక్రమంలో పాల్గొంటారు. 3.20 గంటలకు కప్పరాడలో అర్బన్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని(యూపీహెచ్‌సీ), 4.15 గంటలకు గోపాలపట్నం రైతుబజార్ పక్కన పునర్‌నిర్మించిన కమ్యూనిటీ హెల్త్ సెంటర్(సీహెచ్‌సీ)ను ప్రారంభిస్తారు. 5 గంటలకు చంద్రనగర్‌లో యూపీహెచ్‌సీని ప్రారంభిస్తారు. అక్కడ నుంచి విమానాశ్రయానికి చేరుకొని విజయవాడ వెళ్తారు.

ఆస్పత్రి నుంచి వెళ్లిపోయిన గర్భిణి

- వైద్యసిబ్బంది, ప్రజాప్రతినిధులు నచ్చజెప్పినా లక్ష్యపెట్టని వైనం
- ఉన్నతాధికారుల దృష్టికి గర్భిణి పరిస్థితి



గర్భిణి నవికను బతిమలాడుతున్న వైద్య సిబ్బంది

కొయ్యూరు: రాజేంద్రపాలెం పీహెచ్‌సీ సిబ్బందిని ఓ గర్భిణి పరుగులు పెట్టించింది. వివరాలిలా ఉన్నాయి. బూదరాళ్ల పంచాయతీ లోయలపాలెంకు చెందిన గర్భిణి గెమ్మెలి నవిక (25)కు ఆదివారం ప్రసవ సమయం కావడంతో శనివారం పీహెచ్‌సీ ప్రాంగణంలోని బర్త్ వెయిటింగ్ హాల్‌కు తీసుకువచ్చారు. ఆమెకు గతంలో రెండో కాన్పులో పుట్టిన ఆడబిడ్డ మరణించింది. ఇప్పుడు కూడా ఉమ్మనీరు తక్కువగా ఉండటంతో ఆందోళన చెందిన పీహెచ్‌సీ సిబ్బంది శనివారం ఆమెకు ఇక్కడి బర్త్ వెయిటింగ్ హాల్‌కు తీసుకువచ్చి చేర్పించారు. ఇది జరిగిన కాసేపటికే ఆమె అక్కడినుంచి లోయలపాలెం వెళ్లిపోయింది. ఈ విషయం తెలుసుకున్న పీహెచ్ఎన్ భవాని, హెచ్‌వీ భూలోక, ఎంఎల్‌హెచ్‌పీ జోత్స్న, ఏఎన్ఎం వెంకటలక్ష్మి, వార్డు సభ్యులు సంజీవ, మహిళా పోలీసు దేవి ఆమె ఇంటికి వెళ్లారు. ఆస్పత్రికి తీసుకువచ్చేందుకు వారు విశ్వ ప్రయత్నం చేశారు. అయినప్పటికి వచ్చేది లేదని మొండికేసింది. ఈ విషయాన్ని మంప ఎస్ఐ లోకేష్ కుమార్ దృష్టికి తీసుకువెళ్లారు. ఆయన వెంటనే గామానికి వెళ్లి ఆమెకు నచ్చజెప్పినా లక్ష్యపెట్టలేదు. వలంటీర్‌గా పనిచేస్తున్న ఆమె భర్త కూడా నచ్చజెప్పే ప్రయత్నం చేశాడు. అయినప్పటికీ ఆస్పత్రికి వెళ్లేందుకు ఇష్టపడలేదు. ఉమ్మనీరు తక్కువగా ఉన్నందున ఆస్పత్రిలో ప్రసవం జరిగితే ఎలాంటి ఇబ్బందులు రావని ఆమెకు చెప్పినా వినలేదని వైద్యసిబ్బంది తెలిపారు. ఇదే విషయాన్ని వారు ఉన్నతాధికారులకు నివేదించారు.

వంజంగిలో వీకెండ్ సందడి



వంజంగిలో ఆకట్టుకుంటున్న సూర్యోదయం



పొగమంచు అందాలను తిలకిస్తున్న పర్యాటకులు

పర్యాటక ప్రాంతం వంజంగి హిల్స్‌కు శనివారం పర్యాటకులు పోటెత్తారు. వీకెండ్ కావడంతో దూర ప్రాంతాల నుంచి తరలివచ్చారు. వంజంగి కొండకు కాలినడకన చేరుకుని, పొగమంచు, మేఘాల అందాలను వీక్షించారు. ఉదయం నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు పర్యాటకులతో సందడి మారింది. – సాక్షి, పాడేరు

అటవీ సంరక్షణకు చెక్‌పోస్టు

● రంపచోడవరం డీఎఫ్‌వో నరేంద్రియన్



చెక్‌పోస్టు బోర్డు

రంపచోడవరం: పటిష్టమైన అటవీ సంరక్షణ కోసం సిబ్బంది ఎప్పుడు అప్రమత్తంగా ఉండాలని డీఎఫ్‌వో నరేంద్రియన్ అన్నారు. జిల్లాల విభజనలో భాగంగా ఇందుకూరు రేంజ్ పరిధిలో పందిరిమామిడి జంక్షన్ వద్ద శనివారం అటవీశాఖ చెక్‌పోస్టును అయన ప్రారంభించారు.అనంతరం డీఎఫ్‌వో మాట్లాడుతూ మెరుగైన వన్యప్రాణి, అటవీ సంరక్షణ కోసం చెక్‌పోస్టు ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో సబ్ డీఎఫ్‌వో భరణి, ఇందుకూరు రేంజర్ దుర్గాప్రసాద్‌కుమార్ పాల్గొన్నారు.

నేత్రపర్వంగా కోటి బిల్వార్చన

- వేలాదిగా తరలివచ్చిన భక్తులు
- కేరళ పందళ రాజవంశీకుల ఆధ్వర్యంలో పూజలు
- కార్యక్రమానికి హాజరైన అయ్యప్ప సన్నిధానం పూజారులు


తుని సమీపంలో నేత్రపర్వంగా జరుగుతున్న కోటి బిల్వార్చన

నక్కపల్లి/పాయకరావుపేట : కాకినాడ జిల్లా తుని సమీపంలో ఉన్న ప్రభుత్వ డిగ్రీ కళాశాల సమీపంలో శనివారం కోటి బిల్వార్చన కార్యక్రమం నేత్రపర్వంగా జరిగింది. ఉత్తరాంధ్రలో తొలిసారిగా నిర్వహించిన ఈ కార్యక్రమానికి వేలాది మంది సాధారణ భక్తులతోపాటు, అయ్యప్ప భక్తులు తరలివచ్చారు. కోటి బిల్వార్చన, పడిపూజకుకు కేరళ శబరిమల సన్నిధానం నుంచి పందళ రాజవంశీకులు, అయ్యప్ప స్వామి ఆలయ ప్రధానార్చకులు మేల్‌శాంతి, తిరు ఆభరణాలు తీసుకెళ్లే స్వామి, చండా వాయిద్య కళాకారుల బృందం హాజరైంది. వారి ఆధ్వర్యంలో అయ్యప్పస్వామికి కోటి బిల్వార్చన పడి పూజ శాస్త్రోక్తంగా నిర్వహించారు. ఈ పూజా కార్యక్రమాలను తిలకించేందుకు వేలాది మంది అయ్యప్ప భక్తులు తరలివచ్చారు. సాయంత్రం ప్రారంభమైన ఈ పూజ భక్తులకు కనువిందు చేసింది. ఈ సందర్భంగా శనివారం వేకువజామునే అష్టదవ్య లక్ష్మీగణపతి హోమం, దండపాణి గురుస్వామి జయంతోత్సవం సందర్భంగా కట్రాళ్ల కొండ వద్ద ఉన్న అయ్యప్పస్వామి గుడి నుంచి సభా స్థలం వరకు వందలాది మంది అయ్యప్ప భక్తులతో భారీ ఊరేగింపు నిర్వహించారు. సాయంత్రం ఐదు గంటల నుంచి స్వామివారి పడి పూజ, కోటి బిల్వార్చన కార్యక్రమాలు ప్రారంభమయ్యాయి. తుని, పాయకరావుపేట జంట నగరాలకు చెందిన అయ్యప్పస్వాముల ఆధ్వర్యంలో కాకినాడకు చెందిన దండుపాణి గురుస్వామి పర్యవేక్షణలో ప్రత్యేకంగా నిర్మించిన తాత్కాలిక ఆలయంలో కోటి బిల్వార్చన పడిపూజలు జరిగాయి. పదునెంబాడి మెట్లను ఏర్పాటు చేశారు. పడితొక్కుతూ అయ్యప్ప భక్తులు ఆలపించిన భక్తి గీతాలు ఆకట్టుకున్నాయి.

సచివాలయ వ్యవస్థతో పారదర్శకంగా సేవలు

ఎమ్మెల్యే నాగులపల్లి ధనలక్ష్మి, ఎమ్మెల్సీ అనంతబాబు


సీసీ రోడ్డు నిర్మాణానికి శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే ధనలక్ష్మి, ఎమ్మెల్సీ అనంతబాబు

రంపచోడవరం: గ్రామ సచివాలయ వ్యవస్థ ద్వారా ప్రజలందరికీ మెరుగైన పారదర్శకమైన సేవలు అందుతున్నాయని రంపచోడవరం ఎమ్మెల్యే నాగులపల్లి ధనలక్ష్మి, ఎమ్మెల్సీ అనంత ఉదయభాస్కర్(అనంతబాబు) అన్నారు. మండలంలోని వేములకొండ గ్రామ సచివాలయాన్ని వారు శనివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ధనలక్ష్మి, ఎమ్మెల్సీ అనంతబాబు మాట్లాడుతూ దేశంలో ఎక్కడా లేనటువంటి విధంగా సీఎం జగన్ మోహన్‌రెడ్డి గ్రామ సచివాలయ వ్యవస్థను ప్రవేశపెట్టి ప్రజల చెంతకే పాలన అందించడం చరిత్రాత్మకమన్నారు. సచివాలయ వ్యవస్థ ద్వారా అందుతున్న సేవలపై ప్రజలకు బాగా తెలుసునన్నారు. సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి గిరిజనుల తరపున ధన్యవాదాలు తెలిపారు. నియోజకవర్గంలో కోట్లాది రూపాయలతో చేపడుతున్న అభివృద్ధి పనులు ప్రతిపక్ష నాయకులు కనిపించడం లేదానని ప్రశ్నించారు. ప్రభుత్వం చేస్తున్న ప్రగతిని మెచ్చుకోకపోగా ప్రతిపక్ష నాయకులు రాజకీయ లబ్ధి కోసం చేస్తున్న దుష్ప్రచారాన్ని ప్రజలు గమనిస్తున్నారన్నారు. సంక్షేమానికి, అభివృద్ధికి ప్రభుత్వం రెండు కళ్లలా సమ ప్రాధాన్యమిస్తుందన్నారు. ప్రతిపక్షాలు చేస్తున్న దుష్ప్రచారాన్ని తిప్పి కొట్టాలని ఎమ్మెల్యే ధనలక్ష్మి కోరారు. ఎంపీపీ బందం శ్రీదేవి, జడ్పీటీసీ పండా వెంకటలక్ష్మి, నాయకులు ,కార్యకర్తలు పాల్గొన్నారు.

పేదల ఆరోగ్య పరిరక్షణకు జగనన్న ఆరోగ్య సురక్ష

అరకు ఎమ్మెల్యే చెట్టి పాల్గుణ


మజ్జివలసలో వైద్య శిబిరాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే చెట్టి పాల్గుణ తదితరులు

హుకుంపేట: పేదల ఆరోగ్య పరిరక్షణకు ప్రభుత్వం జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం ప్రవేశపెట్టిందని అరుకు ఎమ్మెల్యే చెట్టి పాల్గుణ అన్నారు. మండలంలోని మారుమూల భూర్జ పంచాయతీ మజ్జివలసలో ఆయన శనివారం పర్యటించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమంలో స్థానిక నాయకులతో కలిసి శిబిరం ప్రారంబించారు. శిబిరానికి వచ్చిన రోగుల ఆరోగ్య వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సభలో ఆయన మాట్లాడుతు గిరిజనుల ఆరోగ్యంపై ప్రభుత్వం ప్రత్యేకంగా దృష్టి సారించిందన్నారు. ప్రజలెవ్వరూ దీర్ఘకాలిక వ్యాధులతో ఇబ్బందులు పడకూడదన్న లక్ష్యంతో జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం ప్రవేశపెట్టి గడప వద్దకే వైద్య సేవలు అందిస్తుందన్నారు. దీంతో గిరిజనులకు ఎంతో మేలు కలిగిందన్నారు. శిబిరంలో 571మందికి వైద్య పరీక్షలు చేసినట్టు వైద్యాధికారులు డాక్టర్ అనుషా, డాక్టర్ గాయత్రి చెప్పారు. ఎంపీపీ కూడా రాజుబాబు, జెడ్పీటీసీ సభ్యుడు రేగం మత్స్యలింగం, ఎంపీడీవో వెంకటరావు, ఈవోపీఈఆర్డీ అప్పలరాజు, సీడీపీవో బాలచంద్రమణి దేవి, సర్పంచ్ పాంగి మొత్తి, ఎంపీటీసీ మజ్జి హరి, మార్కెట్ కమిటీ వైస్ చైర్మెన్ కొండలరావు, జేసీఎస్ మండల ఇన్‌చార్జి కె.రామకృష్ణ, మండల సర్పంచ్‌ల ఫోరం అధ్యక్షుడు కాకరి బొంజుబాబు తదితరులు పాల్గొన్నారు.

విజిలెన్స్ కార్యక్రమాలపై అవగాహన


అవగాహన కల్పిస్తున్న విజిలెన్స్ శాఖ సీఐ కోటేశ్వరరావు

పాడేరు రూరల్ : ప్రభుత్వ ఉద్యోగులకు లంచం ఇవ్వడం, తీసుకోవడం నేరమని విజిలెన్స్ సీఐలు జి.కోటేశ్వరరావు, ఎస్. లక్ష్మోజీలు స్పష్టం చేశారు. విజిలెన్స్ అదనపు సూపరింటెండెంట్ స్వరూపరాణి ఆదేశాల మేరకు శనివారం పాడేరులోని ఓ ప్రయివేటు కళ్యాణ మండపంలో విజిలెన్స్ వారోత్సవాలపై అవగాహన సదస్సు నిర్వహించారు. విజిలెన్స్ సిఐలు కోటేశ్వరరావు, లక్ష్మోజి మాట్లాడుతూ సెంట్రల్ విజిలెన్స్ నియమాల ప్రకారం అక్టోబర్ 30 నుంచి నవంబర్ 5వ తేదీ వరకు విజిలెన్స్ వారోత్సవాలు నిర్వహిస్తున్నామన్నారు. నిత్యావసర సరుకుల్లో నాణ్యత లోపం ఉన్నా, రేషన్ సరుకుల పంపిణీలో జాప్యం జరిగినా, ప్రభుత్వ పథకాలు అందడంలో జాప్యం జరిగినా, ఇతర ఏ ఫిర్యాదులు ఉన్నా విజిలెన్స్ అధికారుల దృష్టికి తీసుకురాలన్నారు. ప్రభుత్వ కార్యాలయాల్లో పని చేసే ఉద్యోగులు లంచం డిమాండ్ చేస్తే కఠిన చర్యలు తప్పవన్నారు. విజిలెన్స్ ఎస్ఐ రవికుమార్, అధికారులు, ఉద్యోగులు, పాల్గొన్నారు.

అబ్బుర పరచిన చిత్రకళా ప్రదర్శన, పోటీ


ప్రదర్శనలో ఉంచిన విద్యార్థుల చిత్రాలు

చోడవరం: ప్రతి చిత్రం ఆలోచన రేకెత్తించింది. ఏదో తెలియని ఓ అలౌకికానందాన్ని కలిగించింది. ఆంధ్రప్రదేశ్, తెలంగాణ, తమిళనాడు, కర్ణాటక, ఒడిశా, గుజరాత్, బీహార్, మహారాష్ట్ర, పశ్చిమబెంగాల్ రాష్ట్రాల నుంచి ప్రముఖ చిత్రాకారులు వేసిన సజీవ చిత్రాలకు స్థానిక ప్రేమ సమాజం ఆవరణ వేదికయింది. చరిత్ర, సంస్కృతీ, సాంప్రదాయాలు, సామాజిక స్పృహ, మానవీయతలను ప్రతిబింబిస్తూ వేసిన చిత్రాలు ఎంతగానో ఆకట్టుకున్నాయి. చోడవరం చిత్రకళా నిలయం ఆధ్వర్యంలో రెండు రోజులపాటు నిర్వహించనున్న 6వ జాతీయ స్థాయి చిత్రకళా పోటీలు, ప్రదర్శనను ప్రభుత్వ విప్ కరణం ధర్మశ్రీ శనివారం ప్రారంభించారు. 198 పెద్ద చిత్రాలు పోటీ పడ్డాయి. విద్యార్థులు వేసిన 2,400 చిత్రాలను నన్నయ వర్సిటీ మాజీ వైస్ చాన్సలర్ ముర్రు ముత్యాలనాయుడు ప్రారంభించారు. ఈ సందర్భంగా ధర్మశ్రీ మాట్లాడుతూ చిత్రకారులను ప్రోత్సహించడంతోపాటు, చోడవరంలో ఆర్ట్ గ్యాలరీ ఏర్పాటుకు కృషి చేస్తానన్నారు. కొత్తగా ఏర్పడిన అనకాపల్లి జిల్లా అన్ని రంగాల వారిని కలిగి ఉన్న అద్భుతమైన జిల్లాగా అభివర్ణించారు. ఎందరో కళాకారులు, ఎన్నో కళలు, ఆధ్యాత్మిక కేంద్రాలు, వ్యవసాయం, విభిన్న వర్గాల ప్రజలున్న చోడవరంలో చిత్రకారులు భావితరాలకు దిక్సూచిగా ఉండటం ఆనందంగా ఉందన్నారు. ముర్రు ముత్యాలనాయుడు మాట్లాడుతూ గత చరిత్రకు చిత్రాలే ప్రధాన ఆధారాలన్నారు. ఒక చిత్ర ఎన్నో భావాలకు సమాధానం చెబుతుందన్నారు. ఈ సందర్భంగా చోడవరం చిత్రకళా నిలయం ఫౌండర్, పోటీల నిర్వాహకుడు బొడ్డేడ సూర్యనారాయణ అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో పలువురు చిత్రకారులను ఘనంగా సత్కరించారు. గోవాడ సుగర్ ఫ్యాక్టరీ ఎండీ సన్యాసినాయుడు, డేవిడ్, ఫారెస్టు రేంజ్ ఆఫీసర్ రవివర్మ, ప్రేమసమాజం రాజు పాల్గొన్నారు.